అంగన్‌వాడీల్లో కూరగాయల సాగు

- పోషణ్ వాటికల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- ఎంపికైన కేంద్రాలకు విత్తన కిట్లు పంపిణీ
- తాజా కూరగాయలతో భోజనం తయారీ


అంగన్‌వాడీ టీచర్లకు విత్తన కిట్లు అందజేస్తున్న సీడీపీవో(ఫైల్)

దండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ్ వాటికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లక్సెట్టిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో మొదటి విడతలో 23 అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ్‌వాటిక కింద ఎంపిక చేశారు. ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయల తోటను సాగుచేయనున్నారు. వీటికి విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తన ప్యాకెట్లను ఇటీవల అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. పాలకూర, మెంతి కూర, తోటకూరతో పాటుగా టమాట, వంగ, బెండ చెట్లను అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఖాళీ స్థలంలో పెంచి, తాజా కూరగాయలతో వండిన పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాలన్నదే లక్ష్యం. వీటి నిర్వహణకు గాను కొంత అమౌంట్‌ను కూడా కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు అంతా బాగా ఉన్నప్పటికీ గ్రామాల్లో కోతుల బెడదతో కూరగాయాల చెట్లు రక్షించుకోవడం పెద్ద సమస్యగా ఉంటుందని పలువురు టీచర్లు, ఆయాలు పేర్కొంటున్నారు.

లక్సెట్టిపేట ఐసీడీఎస్ పరిధిలో ఇలా..

లక్సెట్టిపేట ఐసీడీఎస్ పరిధిలోకి లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలు వస్తాయి. మూడు మండలాల్లో 203అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 39కేంద్రాలకు పక్కా భవనాలు ఉండగా, 51కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దెలేకుండా ఇతర ప్రభుత్వ భవనాల్లో 113కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 203అంగన్ వాడీ కేంద్రాల్లో మొదటి విడతలో లక్సెట్టిపేట మండలంలో-8, దండేపల్లి మండలంలో-8, జన్నారం మండలంలో-7 అంగన్ వాడీ కేంద్రాలకు పోషణ్ వాటికలు మంజూరైనట్లు లక్సెట్టిపేట సీడీపీవో రేష్మా తెలి పారు. మూడు మండలాల్లోని 23అంగన్‌వాడీ కేంద్రాలకు విత్తనకిట్లు కూడా అందించినట్లు పేర్కొన్నారు.

కాళేశ్వరంపై ప్రభుత్వం కుట్రలు ఆపాలి


జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన


బెల్లంపల్లి: రాస్తారోకో చేస్తున్న గులాబీ శ్రేణులు

- బీఆర్‌ఎస్ శ్రేణుల రాస్తారోకో

పాతమంచిర్యాల/తాండూర్/బెల్లంపల్లి/జన్నారం/భీమిని/నెన్నెల/వేమనపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఆపాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంతో పాటు బెల్లంపల్లి, తాండూర్, జన్నారం, భీమిని, నెన్నెల, వేమనపల్లి మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను సీబీఐకి అప్పగించి విచారణ చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాళే శ్వరం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్లకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదే సత్యం, తాండూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, బెల్లంపల్లిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, జన్నారంలో మాజీ వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, అధికార ప్రతినిధి భరత్‌కుమార్, కన్నెపల్లిలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జిల్లెల మహేష్ గౌడ్, నెన్నెలలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, వేమనపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాదవ్, సింగిల్‌విండో చైర్మన్ కుబిడె వెంకటేష్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కదిలిన అధికార యంత్రాంగం


చెన్నూర్‌లో గుంతలు పూడుస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో వినాయకుడి నిమజ్జనానికి చెరువుకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని 'గణేశా..జర పైలం' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో గుంతలమయంగా ఉన్న రోడ్లలో కంకర చిప్స్ వేసి గుంతలు పూడ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన


గోదావరి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి నది తీరాన్ని లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై తహసీనొద్దీన్ మంగళవారం సందర్శించారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల గురించి చర్చించారు. క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. లైట్లు అమర్చాలన్నారు. ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీలు మోహన్, శ్రీనివాస్, నాయకులు వెంగల్‌రావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

ఎంపీ వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

జైపూర్: కాక వారసత్వాన్ని అందిపుచ్చుకుని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే మంచిర్యాల రైల్వేస్టేషన్లో వందేభారత్ రైలు ఆగేందుకు చేసిన కృషి ఫలించిందని కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో మంగళవారం పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, శీలం వెంకటేశ్, రాజబాపురెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్‌యాదవ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అశోక్‌యాదవ్

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల విభజన అనంతరం సహకార సంఘాలను విభజించి ఎన్నికలు నిర్వహించలేదని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర గొర్రెలు, మేకలపెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ మంగళవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిని భీమారంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాలను వేర్వేరు చేసి, సంఘాలకు ఎన్నికలు జరిపి సంఘాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. గొల్ల కుర్మలకు 80శాతం సబ్సిడీపై మినీ డైయిరీ ఫాంలకు రుణాలు అందించాలని కోరారు. యాదవ సంఘం నాయకులు సమ్మయ్య, లింగయ్య తదితరులు ఉన్నారు.

'రాజకీయాలతో ముడిపెట్టొద్దు'

మంచిర్యాలఅర్బన్: శభరిమల అయ్యప్ప స్వామి దేవాలయం నిర్వహణ, వేడుకల ఏర్పాట్లలో రాజకీయ జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ(ఏబీఏపీ) జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాసు, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పస్వామిపై భక్తుల విశ్వాసాన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దని పేర్కొన్నారు.

రేపు సీవీరామన్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మంచిర్యాలఅర్బన్: స్థానిక సీవీరామన్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. ఇమార్టికస్ సహకారంతో శాశ్వత ప్రాతిపదికన హెచ్‌డీఎఫ్‌ఎస్, సిటీ యూనియన్, యాక్సిక్, ఎస్‌బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఏదైనా డిగ్రీ, బీటెక్‌లో 50శాతం మార్కులు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 63019 30991లో సంప్రదించాలన్నారు.

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి


బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


దండేపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి, పేదల పెన్నిధి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని మంగళవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పేద, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం రాజశేఖర్ రెడ్డి పలు పథకాలు ప్రారంభించి సమర్థవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. ఆయా పథకాలు పేద ప్రజల గుండెల్లో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నాయని వివరించారు. మహానేత అకాల మరణం తర్వాత సంక్షేమ పథకాలు పడకేశాయని పేర్కొన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రొడ్డ శారద, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా మాజీ అధ్యక్షుడు బండి రాము, టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ డి.ఆనంద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని దండేపల్లిలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, నాయకులు వెంగల్‌రావు, కంది సతీష్, ముత్యాల శ్రీనివాస్, సిరికొండ నవీన్, వనపర్తి రవి, మామిడి లింగన్న, బొలి శెట్టి సత్తయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు ఇసాక్, ఇందయ్య, కరుణాకర్, రమేశ్, నందునాయక్, మాణిక్యం, శంకరయ్య, సతీశ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్మగ్లర్లను పట్టుకునేందుకే 'హంటర్'


అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

నెన్నెల: కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేటకు పాల్పడుతున్న నిందితులను పట్టుకునేందుకే కవ్వాల్ అభయారణ్యం నుంచి 'హంటర్' అనే జాగిలాన్ని తీసుకొచ్చినట్లు కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్ అన్నారు. కుశ్నపల్లి రేంజ్ పరిధిలోని దుగినేపల్లి, కుశ్నపల్లి గ్రామాల్లో మంగళవారం అనుమానిత అటవీ నేరస్తుల ఇళ్లల్లో జాగిలంతో సోదాలు నిర్వహించారు. బెల్జియం జాతికి చెందిన ఈ జాగిలం అటవీ నేరస్తుల చెమటవాసన, దుస్తువులు, అడుగుల జాడ, ఇతర వస్తువుల ఆధారంగా నిందితులను పసిగట్టి పట్టుకుంటుందన్నారు. అడవుల్లో ఎలాంటి నేరం చేసినా, ఇట్టే బయటపడతారని పేర్కొన్నారు. అనంతరం అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వోలు రాందాస్, ఎఫ్‌బీవోలు శంకర్, మహేష్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల నాయకుల సంబురాలు


టపాసులు కాలుస్తున్న సంఘ నాయకులు

జన్నారం: బీసీ రిజర్వేషన్ 42శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆమోదించడం పై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జన్నారం మండల కేంద్రంలో కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు సంబురాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు.

అంధత్వ నివారణపై అవగాహన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు, లయన్స్‌క్లబ్ సభ్యులు

పాతమంచిర్యాల: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్టు కోఆర్డినేటర్ ఫర్ ఐ క్యాంప్స్ వి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రా రెడ్డి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ గీతాంజలి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోస్టర్ ఆవిష్కరించి నేత్రదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీమన్నారాయణ, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు వి.వినయ్‌కుమార్, సుగుణాకర్ రెడ్డి, సిరిపురం శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


ఐఎఫ్‌టీయూ నాయకులతో కార్మికుల ధర్నా

మందమర్రిరూరల్: మందమర్రి డివిజన్‌లోని బెల్లంపల్లి ఏరియాలో గల సులభ్‌కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏరియాలోని జీఎం ఆఫీస్ వద్ద ఐఎఫ్‌టీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. సింగరేణి సులభ్‌వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. సులభ్‌కాంప్లెక్స్ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. కార్మికులకు ప్రతీనెల 7వ తేదీ లోగా వేతనాలు చెల్లించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, కార్మికులకు వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని మండిపడ్డారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు ఎండీ జాఫర్, నాయకులు శ్రీనివాస్, సులభ్ కాంప్లెక్స్ కార్మికులు ఉన్నారు.

ఐఎన్టీయూసీ ఈఅండ్ఎం ఇన్‌చార్జిగా పేరం రమేశ్


పేరం రమేశ్

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ యూనియన్ ఈఅండ్ఎం టెక్నికల్, సూపర్‌వైజర్ స్టాఫ్ కేంద్ర కమిటీ ఇన్‌చార్జిగా పేరం రమేశ్‌ను నియమించారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న పేరం రమేశ్‌కు ఈ నూతన బాధ్యతలను మంగళవారం ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అప్పగించారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించినందుకు యూనియన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రమేశ్ పేర్కొన్నారు. తన పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఏరియా ఇంజనీర్ విభాగంలో పనిచేసి ఆగస్టు 31న రిటైర్డ్ అయిన ప్రసాద్‌రావును ఏరియా జీఎం శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. కంపెనీలో వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్సా పాల్గొన్నారు.

12న 'చలో ప్రజాభవన్'

శ్రీరాంపూర్: కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న చలో ప్రజాభవన్ కార్యక్రమం చేపట్టినట్లు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ కార్మికుల చట్టబద్ధ హక్కులు కల్పించాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ ఎస్సీకేఎస్ నాయకులు గట్టు మహేందర్, సంపత్, సమ్మయ్య, సతీశ్, కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు


అష్టదశ శక్తి పీఠం అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు


ఆస్నాదలోని ఇంగిలి వాడలో...


నైవేద్యం సమర్పిస్తున్న భక్తురాలు

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట/భీమారం/దండేపల్లి/జన్నారం/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడు ఘనమైన పూజలు అందుకుంటున్నాడు. భక్తులు మంగళవారం కుంకుమపూజలు, అన్నదానాలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీ శ్రీరామ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో అష్టదశ శక్తి శక్తి పీఠం అమ్మవారి ప్రతిరూపాలను అలంకరించారు. చెన్నూర్ మండలంలోని ఆస్నాదలో ఇంగిలివాడలో, లక్సెట్టిపేట మండలం ఆంధ్రాకాలనీ వినాయక భక్త మండలి వద్ద, భీమారం మండల కేంద్రంలోని ఐబీ గణేశ్‌మండలి వద్ద, చెన్నూర్ ఎమ్మెల్యే కాలనీలో గల ముదిరాజ్ గణేశ్ మండలి, పాత బస్టాండ్ సమీపంలో గల ఫ్రెండ్స్ గణేశ్ మండళ్ల వద్ద, దండేపల్లిలో శ్రీ శివగణేష్ భక్త మండలి, మేదరిపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, తాండూర్ మండలంలోని శ్రీ గణేష్ మండలి వద్ద సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో కమాండెంట్ దంపతులు పద్మ-వెంకటరాములు పాల్గొన్నారు. జన్నారం మండల ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం ఆధ్వర్యంలో మహాగణపతి వద్ద మండల హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమం నిర్వహించారు.


భీమారంలోని ఐబీ వినాయక మండపం వద్ద...


దండేపల్లిలో కుంకుమపూజలు


గుడిపేట బెటాలియన్‌లో అన్నదానం


చెన్నూర్ ఫ్రెండ్స్ గణేశ్ మండలి వద్ద...


ఆంధ్రాకాలనీ వినాయక భక్త మండలి వద్ద...


తాండూర్:శ్రీ గణేశ్ మండలి వద్ద కుంకుమ పూజ

సంక్షిప్త వార్తలు

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

పాతమంచిర్యాల: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ గర్మిళ్ల జోనల్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నస్పూర్ జోన్ అధ్యక్షుడు కర్రె చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి మేరడికొండ శ్రీనివాస్, బింగి సత్యనారాయణ, రెడ్డిమల్ల అశోక్, మద్ది సుమన్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో జిల్లాకు రెండో బహుమతి

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన కార్మెల్ హైస్కూల్ విద్యార్థులు స్టేట్ లెవెల్‌లో రెండో బహుమతి సాధించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్‌లు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

'ప్రభుత్వ భూములు కాపాడాలి'

లక్సెట్టిపేట: రియల్ ఎస్టేట్ కబ్జాల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ మంగళవారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను, గ్రామాల్లో కుంటలు, ఇరిగేషన్ స్థలాలను కొందరు వ్యాపారులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు రాజేంద్రప్రసాద్, కిరణ్‌బాబు, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామ గౌడసంఘం కమిటీని మంగళవారం నియమించినట్లు కో ఆపరేటివ్ కార్యాలయ సీనియర్ ఇన్స్‌స్పెక్టర్, ఎన్నికల అధికారి ఏవీఆర్‌డీ ప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా నేరెల్ల రాజగౌడ్, ఉపాధ్యక్షుడిగా తిరుమల అంజగౌడ్, ప్రధాన కార్యదర్శిగా తిర్రి శ్రీనివాసగౌడ్, కోశాధికారిగా సుద్దాల నాగేశ్, సలహాదారులుగా తుడూరి చిన్న రాజగౌడ్, సత్యగౌడ్ లను ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రమేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): టీపీసీసీ హాజీపూర్ మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా నంనూర్‌కు చెందిన ఆడెపు రమేశ్ నియామకం అయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మంగళవారం రమేశ్‌కు నియామక లేఖ అందజేశారు.